# భారత్‌లో... హైదరాబాద్ సంస్థానం విలీనం

**స్వతంత్ర భారతదేశంలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం ఎదుర్కొన్న తొలి ప్రధాన సవాలు స్వదేశీ సంస్థానాల విలీనం. బ్రిటిషర్ల పాలన నుంచి స్వాతంత్ర్యం సంపాదించిన వెంటనే ఈ సమస్యను పరిష్కరించాల్సి వచ్చింది. ఈ సంస్థానాల్లో అతి పెద్దదైన హైదరాబాద్‌ను భారత యూనియన్‌లో విలీనం చేయడం తొలుత పెద్ద సమస్యగా కనిపించినా... చివరికి నిజాం సేనలపై బలప్రయోగం అవసరం లేకుండానే పని పూర్తయింది!!**

ఆంగ్లేయుల పాలనలో ఉన్న భారతదేశంలో... దాదాపు నలభై శాతం భూభాగం చిన్న, పెద్ద స్వదేశీ సంస్థానాల ఏలుబడిలో ఉండేది. ఈ సంస్థానాల పాలకులను 'ప్రిన్సెస్' అని పిలిచేవారు. వారు బ్రిటిషర్ల సార్వభౌమత్వాన్ని అంగీకరించి.. పరిమిత అధికారాలతో తమ సంస్థానాలను పాలించేవారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా ఉన్నందుకు ప్రతిగా... ఈ సంస్థానాధీశులకు ఆంగ్లేయులు రక్షణ కల్పించేవారు. 1947లో ఆంగ్లేయులు దేశం విడిచిపోగానే... స్వదేశీ సంస్థానాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. బ్రిటిషర్లు వెళ్లిపోయాక తమకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని ఆశించిన సంస్థానాధీశులు పలువురు... ఆ దిశగా పథకాలు పన్నడానికి సిద్ధమయ్యారు. తాము వందేళ్లకు పైగా బ్రిటిష్ పాలకులకు సామంతులుగా వ్యవహరించామనీ.. ఇప్పుడు ఇండియా, పాకిస్థాన్‌లలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలకు తమపై పెత్తనం ఉండదని వాదించడం మొదలెట్టారు.

## సంస్థానాధీశుల ఆశలు:

తాము వెళ్లిపోయాక స్వదేశీ సంస్థానాధీశులపై అధికారాన్ని.... బ్రిటిష్ ఇండియాలోని ఏ ఇతర ప్రభుత్వానికి బదిలీ చేయడం లేదని, అప్పటి ఇంగ్లండ్ ప్రధాని క్లెమెంట్ అట్లీ 1947, ఫిబ్రవరిలో చేసిన ప్రకటన సంస్థానాధీశుల్లో కొత్త ఆశలు రేపింది. బ్రిటిషర్ల సార్వభౌమత్వం ముగిసిన వెంటనే ఈ సంస్థానాలు కోరుకుంటే... స్వతంత్ర రాజ్యాలవుతాయని ముస్లింలీగ్ నేత మహ్మదలీ జిన్నా 1947, జూన్ 18న చేసిన ప్రకటన... ఈ స్వదేశీ పాలకుల ఆశలకు ఊతం ఇచ్చింది. దాంతో బ్రిటిషర్ల పాలన ముగిసే 1947, ఆగస్టు 15న తాము, తమ రాజ్యాలకు పాలకులుగా.. సర్వస్వతంత్రులమవుతామని భావించారు. అయితే, బ్రిటిష్ పార్లమెంటులో భారత స్వాతంత్ర్య బిల్లుపై అట్లీ ప్రసంగిస్తూ.. ఈ సంస్థానాలు క్రమేణా ఇండియా, పాకిస్థాన్‌లలో ఏదో ఒక దేశంలో చేరతాయని వివరించారు. జాతీయవాదులెవరూ ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. ఇప్పటికే రెండు దేశాలుగా చీలిన భారత ఉపఖండంలో... ఈ సంస్థానాధీశులకు స్వేచ్ఛ ఇస్తే వందలాది దేశాలు పుట్టుకొస్తాయని వారు భయపడ్డారు. నెహ్రూ సర్కారు ఈ సంస్థానాలన్నిటినీ భారత యూనియన్‌లో విలీనం చేయాలనే కృతనిశ్చయానికి వచ్చింది. ఈ విషయంలో ఉపప్రధాని, కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్... కొన్నిచోట్ల మంచి మాటలతో... అవసరమైన చోట్ల బలప్రయోగంతో.. ఈ సంస్థానాధీశులను దారిలోకి తేవడంలో విజయం సాధించారు.

## మొండికేసిన ముగ్గురు:

రెండు దశల్లో వందలాది రాజ్యాలను విలీనం చేయించారు. కొన్ని సంస్థానాల పాలకులు దూరదృష్టితో, దేశభక్తితో... 1947, ఏప్రిల్‌లోనే రాజ్యాంగ పరిషత్‌లో చేరారు. అత్యధిక సంస్థానాధీశులు ఇందులో పాల్గొనలేదు. స్వాతంత్ర్యం తమ హక్కు అంటూ.. హైదరాబాద్, భోపాల్, తిరువాన్కూరు వంటి పెద్ద సంస్థానాల పాలకులు బహిరంగంగానే ప్రకటించారు. అయితే, ఆగస్టు 15లోగా తమ రాజ్యాలను భారత్‌లో విలీనం చేయాలని భారత యూనియన్‌లోని సంస్థానాలను పటేల్ కోరారు. తమ సంస్థానాలలోని ప్రజలు తిరుగుబాటు చేస్తారనే భయంతో... కేంద్రం బలప్రయోగం చేస్తుందనే భీతితోనూ.. ముగ్గురు మినహా ఈ స్వదేశీ రాజులందరూ పటేల్ మాట విన్నారు. రాజ్యాధికారాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారు. 1947, ఆగస్టు 15 నాటికి జునాగఢ్, జమ్మూకాశ్మీర్, హైదరాబాద్ మాత్రం భారత యూనియన్‌లో విలీనం కాలేదు. హిందువులు మెజారిటీగా ఉన్న జునాగఢ్‌లో... పాలకుడు ముస్లిం. అలాగే ముస్లింలు అత్యధిక సంఖ్యలో ఉన్న కాశ్మీర్ రాజు హిందువు. హిందువులు అత్యధిక సంఖ్యలో ఉన్న హైదరాబాద్ నవాబు ముస్లిం. క్లిష్ట పరిస్థితుల్లో కాశ్మీర్ రాజు హరిసింగ్ తన రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేస్తూ... విలీన పత్రంపై సంతకం చేశారు.

## స్వతంత్రుడినన్న నిజాం:

దారికిరాని జునాగఢ్, హైదరాబాద్ విషయంలో కేంద్ర ప్రభుత్వం బలప్రయోగానికి సిద్ధమైంది. అప్పటికి భౌగోళికంగా చూస్తే భారత్‌లో అతి పెద్ద రాష్ట్రం హైదరాబాద్. ఆగస్టు 15 నాటికి భారత యూనియన్‌లో తన సంస్థానాన్ని విలీనం చేయని మూడో పాలకుడు హైదరాబాద్ నిజాం. పాకిస్థాన్ ప్రోత్సాహంతో తాను స్వతంత్రుడినని ప్రకటించుకోవడమే కాక... తన సైనిక దళాలను పెంచుకోవడానికి ప్రయత్నించాడు. మొండికేసిన నిజాంతో తాను మాట్లాడి ఒప్పిస్తానని చివరి బ్రిటిష్ వైస్రాయ్ మౌంట్‌బాటన్ హామీ ఇవ్వడంతో పటేల్ కొంత వేచిచూసే ధోరణి అవలంభించారు. హైదరాబాద్‌ను పాకిస్థాన్‌లో చేర్చనని నిజాం రహస్య హామీ ఇవ్వడం కూడా దీనికి కారణం. అయితే దేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్‌ను స్వతంత్ర రాజ్యంగా అనుమతించేది లేదని పటేల్ స్పష్టం చేశారు. ఈలోగా హైదరాబాద్

SAKSHI

రాష్ట్రంలో... ఇతర రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిజాం ప్రభుత్వ మద్దతు, ప్రోత్సాహంతో ఇత్తిహాద్ ఉల్ ముస్లిమీన్, దాని సాయుధ విభాగం రజాకార్లు విజృంభించారు.

## కాంగ్రెస్ నేతల సత్యాగ్రహం:

ఆ తరుణంలో హైదారాబాద్ రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని కోరుతూ... 1947, ఆగస్టు 7న కాంగ్రెస్ నాయకులు సత్యాగ్రహ ఉద్యమం చేపట్టారు. సత్యాగ్రహంలో పాల్గొన్న 20 వేల మందిని నిజాం సర్కారు జైల్లో పెట్టింది. మరోవైపు రజాకార్ల దాడులు, ప్రభుత్వ దమనకాండ ఫలితంగా వేలాది మంది ప్రజలు పొరుగు రాష్ట్రాల్లో తలదాచుకున్నారు. హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతంలో... 1946లో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రైతులు సాయుధ పోరాటం చేశారు. నిజాం అణచివేత చర్యలు, బలప్రయోగం ఫలితంగా... 1946 చివరి నాటికి రైతు పోరాటం బలహీనపడింది. స్వాతంత్ర్యం రాగానే మళ్లీ ఊపందుకుంది. రజాకార్లు, దేశ్ ముఖ్‌ల దాడుల నుంచి ప్రజలను కాపాడేందుకు కమ్యూనిస్టులు దళాలను ఏర్పాటు చేశారు. బడా భూస్వాములపై దాడులు చేశారు. ఆక్రమించుకున్న భూమిని రైతులు, భూమి లేని కూలీలకు పంపిణీ చేశారు. 1948, జూన్ నాటికి సర్దార్ పటేల్ ఇక లాభం లేదనుకున్నారు. అప్పటిదాకా జరుపుతున్న సంప్రదింపులు ఓ కొలిక్కి రాలేదు. నిజాం ఎటూ తేల్చకుండా అధికారంలో కొనసాగటానికి ప్రయత్నిస్తున్నారనే విషయం ప్రభుత్వానికి అర్థమైంది. ఈ విషయాన్ని డెహ్రాడూన్‌లో అనారోగ్యంతో ఉన్న పటేల్, నెహ్రూకు రాసిన లేఖలో వివరించారు. ''బేషరతుగా హైదరాబాద్‌ను యూనియన్‌లో విలీనం చేసి, బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి తక్షణమే అంగీకరించాలని నిజాంకు చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని నేను గట్టిగా భావిస్తున్నాను'' అని పటేల్ ఈ లేఖలో తేల్చి చెప్పారు.

## సైనిక చర్య:

రజాకార్లు తెలంగాణ జిల్లాల్లో ఎన్ని దురంతాలకు పాల్పడినా.. నిజాం పలు విధాల రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా... భారత ప్రభుత్వం కొన్ని నెలలపాటు ఓపిక పట్టింది. నిజాం పెద్ద ఎత్తున ఆయుధాలను దిగుమతి చేసుకోవడం.. రజాకార్ల దురాగతాల నేపథ్యంలో పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరింది. ఓ వైపు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం సాగుతోంది. మరోవైపు రజాకార్ల దుర్మార్గాలు పెచ్చుమీరుతున్నాయి. దాంతో నెహ్రూ సర్కారు 1948, సెప్టెంబరు 13న భారత సైన్యాన్ని హైదరాబాద్‌కు తరలించింది. మేజర్ జనరల్ జె.ఎన్.చౌధరీ నాయకత్వంలో ఐదు వైపుల నుంచి సైనిక దళాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. పోలీస్ చర్యగా పేరు పొందిన ఈ సైనిక చర్య విజయవంతమైంది. ఎలాంటి బలప్రయోగం జరగకముందే.. సెప్టెంబరు 18న నిజాం దళాలు లొంగిపోయాయి. ఏడో నిజాం ఉస్మాన్ అలీఖాన్ గత్యంతరం లేని పరిస్థితుల్లో నెహ్రూ సర్కారు ముందు తలొంచక తప్పలేదు. నిజాం ప్రధాని మీర్ లాయక్ అలీ, రజాకార్ల ముఠా నాయకుడు ఖాసీం రజ్వీని అరెస్టు చేశారు. ఐదు రోజుల తర్వాత 23న నిజాం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి అంతకుముందు ఇచ్చిన ఫిర్యాదును వాపసు తీసుకున్నారు.

హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తదనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అయ్యారు!!

- **1947, ఆగస్టు 15 నాటికి భారత యూనియన్‌లో విలీనం కాని సంస్థానాలు ఎన్ని? అవి ఏవి?**

  **జవాబు:** మూడు, జునాగఢ్, జమ్మూకాశ్మీర్, హైదరాబాద్
- **జమ్మూకాశ్మీర్ సంస్థానం రాజు పేరు?**

  **జవాబు:** హరిసింగ్
- **''బ్రిటిష్ ఇండియాలోని సంస్థానాలపై ఏ ప్రభుత్వానికి కూడా అధికారాన్ని బదిలీ చేయడం లేదు'' అని ప్రకటించిన ఇంగ్లాండ్ ప్రధాని ఎవరు? ఎప్పుడు అన్నారు?**

  **జవాబు:** క్లెమెంట్ అట్లీ, 1947, ఫిబ్రవరిలో
- **భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానం విలీనానికి భారత సైన్యాన్ని ఎప్పుడు తరలించింది?**

  **జవాబు:** 1948, సెప్టెంబరు 13న
- **నిజాం దళాలు ఎప్పుడు లొంగిపోయాయి?**

  **జవాబు:** 1948, సెప్టెంబరు 18న
- **హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఎవరు?**

  **జవాబు:** బూర్గుల రామకృష్ణా రావు
- **రజాకారులకు నాయకత్వం వహించిందెవరు?**

  **జవాబు:** ఖాసీం రజ్వీ

SAKSHI